సాక్షి ఖమ్మం

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



పత్తికి ప్రతికూలమే...

సీజన్ ఆరంభంలో అంతా బాగానే ఉందని భావించగా వరుస వర్షాలతో పత్తి రైతులు ప్రతికూల పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

IIలో



పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోం

హైడ్రా పేరుతో పేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకోబోమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు.

IIలో

గరిష్టం / కనిష్టం
31° / 22°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. అన్ని ప్రాంతాల్లో ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఫర్నీచర్, సామగ్రి సరఫరాకు టెండర్లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని 11 కళాశాల వసతి గృహాలకు డైనింగ్ టేబుళ్లు, బెంచీలు, మైక్ సెట్లు, కుక్కర్లు, అల్మారాలు, వెట్ గ్రైండర్ల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో టెండర్ ఫారాలు స్వీకరించి, పూర్తిచేశాక సీల్డ్ కవర్‌లో నవంబర్ 2వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా సమర్పించాలని సూచించారు. ఆయా టెండర్లను నవంబర్ 4న పరిశీలించి ఖరారు చేస్తామని, వివరాలకు 94406 40070, 94419 08672 నంబర్లలో సంప్రదించాలని పీఓ తెలిపారు.

5న ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం సహకారనగర్: సమగ్ర కులాల స్థితిగతులు, స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనం తదితర అంశాలపై బీసీ కమిషన్ వచ్చేనెల 5న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం గంటల వరకు జరిగే సమావేశంలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, మేధావులు హాజరై తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు. అభిప్రాయాలు, అభ్యర్థనలను తెలుగు, ఆంగ్లం లేదా ఏదైనా భాషల్లో రాతపూర్వకంగా ఆరు సెట్లలో సమర్పించాలని తెలిపారు.

విద్వన్మహాసభల ద్వారా వేదవిద్య వ్యాప్తి



విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న పండితులు

ఖమ్మంగాంధీచౌక్: వేద విద్య వ్యాప్తికి జరుగుతున్న కృషిలో భాగంగా విద్వన్మహాసభలు నిర్వహించడం అభినందనీయమని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమీషనర్ ఎం.వీరస్వామి అన్నారు. ఖమ్మం ఎన్ఎస్‌పీ క్యాంపులోని రామగిరి శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న 24వ తెలంగాణ విద్వన్మహాసభల(పరీక్షలు)ను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సభలకు రాష్ట్ర నలుమూలల నుంచి వేద విద్యార్థులు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. శ్రీ గాయత్రీ సేవా సమితి, జనార్ధనానంద సరస్వతి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యాన హరి శ్రీనివాస్, లక్ష్మీనరసింహ, ఈఓ శ్రీకాంత్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతాయి.



పల్లెకు చేరని సర్కార్ వైద్యం

పల్లె వైద్యానికి సుస్తీ చేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వీటి పరిధిలోని సబ్ సెంటర్లు, పల్లె దవాఖానాల్లో సరిపడా సిబ్బంది లేక.. ఖాళీలను భర్తీ చేయకపోగా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఫలితంగా పలు కేంద్రాల్లో ఏఎన్‌ఎంలు, కింది స్థాయి సిబ్బందే వైద్యుల అవతారమెత్తాల్సి వస్తోంది. పల్లెల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్న తరుణంలో ఈ కేంద్రాల్లో వైద్యసేవలు అందక పట్టణాల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా చితికిపోతున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

- పలు ఆస్పత్రుల్లో వైద్యుల కొరతతో అందని సేవలు
- పూర్తి స్థాయిలో ఖాళీలు భర్తీ చేయకపోవడమే కారణం
- కొన్నిచోట్ల ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బందే పెద్దదిక్కు
- ఏటా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా పట్టని సర్కార్

23 మంది వైద్యులు కావలెను..

జిల్లాలోని పీహెచ్‌సీలు, పల్లె దవాఖానాలు, యూపీహెచ్‌సీల్లో కలిపి 23 మంది వైద్యుల కొరత ఉంది. ఇక మొదటి ఏఎన్‌ఎంలు, సెకండ్ ఏఎన్‌ఎంలు కలిపి 399 మంది ఉండగా, వీరిలో మొదటి ఏఎన్‌ఎంలు 232 మంది, సెకండ్ ఏఎన్‌ఎంలు 167మంది విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ప్రస్తుత లెక్కల ఆధారంగా 450 మందిని నియమించాల్సి ఉండగా, 51 మంది కొరత ఉంది. అలాగే జనాభా దామాషా ప్రకారం ప్రతీ వెయ్యి మందికి ఒక ఆశా వర్కర్ ఉండాలి. కానీ జిల్లాలో 1,331 మందే ఉండడంతో 650 మందిని నియమించాల్సి ఉంది. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారం తెలుసుకునే సిబ్బంది పూర్తి స్థాయిలో భర్తీ కాక ఉన్న వారిపై భారం పడుతోంది. మరోపక్క పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు.



ఏన్కూరు పీహెచ్‌సీలో చికిత్సకు వచ్చిన స్థానికులు

సీజన్ వస్తే ఇబ్బందులే..

వర్షాకాలం సీజన్ వచ్చిందంటే పల్లెల్లో విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు ఇతర విష జ్వరాలతో పల్లెప్రజలు మంచం పడుతున్నారు. కానీ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో సరిగా వైద్యం అందక వీరు ఇబ్బంది పడుతున్నారు. పలు కేంద్రాల్లో వైద్యులు లేకపోవడంతో సిబ్బందే పెద్దదిక్కుగా మారుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో జబ్బు నయం కాక.. విధిలేని పరిస్థితుల్లో పట్టణ కేంద్రాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల బాటపడుతున్నారు. ఏటా వర్షాకాలం సీజన్‌కు ముందు వైద్య, ఆరోగ్య శాఖ పరంగా సమీక్షలు నిర్వహించి కేటగిరీల వారీగా ఖాళీల వివరాలను ప్రభుత్వానికి పంపుతారు. ఈ ఏడాది కూడా ఇలాగే పంపినప్పటికీ సీజన్ ముగిసినా పోస్టులు భర్తీ కాకపోవడం గమనార్హం.

సిబ్బంది కొరత..

ఏన్కూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మండలంలో 11 సబ్ సెంటర్లు ఉన్నాయి. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు సేవలందిస్తున్నారు. ఇక్కడ రోజు ఓపీ 100 నమోదవుతుండగా, 20 మంది ఇన్‌పేషెంట్లు ఉంటారు. 24 గంటలు కొనసాగే ఈ ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉంది. స్టాఫ్‌నర్స్‌తో పాటు నలుగురు రెగ్యులర్ ఏఎన్‌ఎంలు, ఫార్మసిస్ట్, సెకండ్ ఏఎన్ఎం పోస్టులు రెండు ఖాళీగా ఉండడంతో ప్రజలకు సేవలు ఏ మేర అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఇక్కడ డాక్టర్ లేదు ..

ఎర్రుపాలెంలోని పల్లె దవాఖానాకు డాక్టర్‌ను నియమించలేదు. ఇక్కడ డాక్టర్‌తో పాటు హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఐదుగురు ఆశా కార్యకర్తలు ఉండాల్సి ఉండగా.... డాక్టర్ పోస్టుతో పాటు పెగళ్లపాడులోని ఆశా కార్యకర్త పోస్ట్ భర్తీకి నోచుకోలేదు. మండలంలోని మీనవోలు పల్లె దవాఖానాలో హెల్త్ అసిస్టెంట్, తక్కెళ్లపాడులో ఆశా కార్యకర్త పోస్ట్ ఖాళీగా ఉంది. ఇక ఎర్రుపాలెం దవాఖానా నిర్మించి ఐదేళ్లు దాటకుండానే స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో సిబ్బంది భయభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతేకాక ఇక్కడ తాగునీరు సరఫరా కూడా లేదు.



ఎర్రుపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం

నాతో ఆటలు వద్దు..

- ఏం జరుగుతుందో నాకు తెలియదా?
- భవనం కట్టే వరకు చూసి నోటీసులిస్తారా..
- కేఎంసీ సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన కమిషనర్ అభిషేక్, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: 'డోంట్ ప్లే విత్ మీ.. మీ శాఖ ఎలా పని చేస్తుందో నాకు తెలుసు.. వ్యక్తిగతంగా ఎవరేం చేస్తున్నారో అంతా తెలుసు.. కలెక్టర్‌కు చెప్పేశాం.. అయిపోయింది అనుకుంటున్నారు. సిల్లీ రీజన్స్ చెబితే సస్పెండ్ చేసి పక్కన పెడతా.. అక్రమంగా ఆరు అంతస్తుల భవనం కట్టాక నోటీసులివ్వడం ఏమిటి.. కట్టేటప్పుడు నిద్రపోయారా' అంటూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కేఎంసీలో గురువారం ఆయన టౌన్‌ప్లానింగ్, పారిశుద్ధ్యం, రెవెన్యూ విభాగాలపై సమీక్షించారు. నగరంలో ఆక్రమణలు జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యోగుల నిర్లక్ష్యంతో రెండు డివిజన్లు వరదల్లో మునిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అనుమతులు లేని భవనాలు కూల్చమంటే నాలుగైదు ఇటుకలు పడేసి వస్తుండడంతో మరునాడే నిర్మాణం మొదలవుతోందని తెలిపారు. భవన యజమానులకు ముందే సమాచారం ఇచ్చి వెళ్లి.. తమపై ఒత్తిడి వస్తోందని చెప్పడం సరికాదని కలెక్టర్ తెలిపారు.

పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు

పారిశుద్ధ్య సిబ్బంది లెక్కలు తప్పుగా ఉంటున్నాయని, క్షేత్ర స్థాయిలో తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పనిచేయని వారిని తీసేస్తూ, సిబ్బంది కేటాయింపులో శాస్త్రీయత పాటించాలని తెలిపారు. ఇంటికి చెత్త బండి ఎప్పు డు వస్తుందో షెడ్యూల్ తయారు చేసి హోర్డింగ్‌లను డివిజన్లలో ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే, కేఎంసీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించాలని, షాపులకు సంబంధించి ఎక్కడ చెత్త వస్తుందో గుర్తించి రోడ్డుపై వేయకుండా చూడాలని తెలిపారు. డివిజన్లలో అపరిశుభ్ర ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించి పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని కలెక్టర్ తెలిపారు. ఇక అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, అయినా ఏర్పాటుచేస్తే భారీగా జరిమానా విధించాలని కలెక్టర్ తెలిపారు. ఇక ఆస్తిపన్ను విలువ పరిశీలన, నీటి బిల్లుల వసూళ్లు, ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్‌పై సూచనలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా, ఈఈ క్రిష్ణలాల్, ఏసీపీ వసుంధర, ఆర్‌ఓ జి.శ్రీనివాసరావుతో పాటు విజయానంద్, సాంబయ్య, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీని లాభాల్లో నడిపించాలి

ఎర్రుపాలెం: ఇందిరా మహిళా డెయిరీని లాభాల బాటలో నడిపేలా అందరూ కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఎర్రుపాలెంలోని ఇందిరా డెయిరీ పాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన మహిళా పాడి రైతులతో మాట్లాడారు. నాణ్యమైన పాలు పోసే రైతులను గుర్తించి మిగతా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ విషయమై శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఇక ఎంపిక చేసిన వారిని త్వరలో గుజరాత్‌లో అమూల్ డైరీ పరిశీలనకు పంపిస్తామన్నారు. డీఆర్డీఓ సన్యాసయ్య, తహసీల్దార్ ఉషాశారద, ఇందిరా మహిళా డెయిరీ మేనేజర్ సిద్దేశ్వర్, ఏపీఎం కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉత్తమ సమాజం

కళాశాల విద్య జేడీ రాజేందర్‌సింగ్



మాట్లాడుతున్న జేడీ రాజేందర్‌సింగ్

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యే ఉత్తమ సమాజ స్థాపనలో కీలక భూమిక పోషిస్తుందని కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రాజేందర్ సింగ్ తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం సమావేశమైన ఆయన కళాశాలల్లో ప్రవేశాలు, మౌలిక వసతుల కల్పన, బోధన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు పెంపుపై సూచనలు చేశారు. ఇటీవల అటానమస్ హోదా పొందిన కళాశాలలకు కావాల్సిన సదుపాయాలపై ఆరాతీశారు. తొలుత జేడీ నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం, రామదాసు ధ్యాన మందిరాన్ని సందర్శించాక స్థానిక డిగ్రీ కాలేజీలో మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు అమలుచేసిన 'దోస్త్'కు మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతో పాటు పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ జకీరుల్లా, డాక్టర్ ఆలేటి పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్చండి..

- రైల్వే జీఎంను కోరిన ఎంపీ రఘురాంరెడ్డి
- బడ్జెట్ ముందస్తు భేటీలో ప్రతిపాదన



జీఎం అరుణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల ప్రతిపాదించిన డోర్నకల్ – మిర్యాలగూడ, డోర్నకల్ – గద్వాల రైల్వే లైన్లతో ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు అన్యాయం జరుగుతోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు సన్నాహకంగా ఎంపీలతో నిర్వహించే భేటీ గురువారం హైదరాబాద్ జరగగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని ఎంపీలతో కలిసి హాజరైన రఘురాంరెడ్డి మాట్లాడారు. పాలేరు నియోజకవర్గ రైతులు ఇప్పటికే జాతీయ రహదారులు, సీతారామ లెఫ్ట్ కెనాల్, భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ వంటి ప్రాజెక్టులకు భూములు ఇచ్చారని తెలిపారు. ఈ నేపథ్యాన కొత్త రైల్వేలైన్ల విషయంలో రైతులకు నష్టం రాకుండా చూడాలని కోరారు. ప్రతిపాదిత రైల్వే లైన్‌ను డోర్నకల్, మన్నెగూడెం, అబ్బాయిపాలెం, మరిపెడ, మోతె, విష్ణుపురం మీదుగా మిర్యాలగూడెం వరకు నిర్మించాలని ప్రతిపాదించారు. తద్వారా వరంగల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లావాసులకు ఉపయోగంగా ఉంటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై భూసేకరణ ఖర్చు సైతం తగ్గుతుందని ఎంపీ వివరించారు. కాగా, ఈ ప్రతిపాదనకు వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, బలరామ్‌నాయక్ సైతం మద్దతు తెలిపారు. అంతేకాక అలైన్‌మెంట్ మార్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కూడా విజ్ఞప్తి చేశారు.

మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పరిశీలనకు న్యాక్ బృందం వచ్చింది. ఐదేళ్లకోసారి జరిపే పరిశీలనలో భాగంగా వచ్చిన బృందం చైర్‌పర్సన్‌గా డాక్టర్ పురుషోత్తంనాయక్, డాక్టర్ చంద్రికాలయం, డాక్టర్ జోసెఫ్ సభ్యులుగానే కాక కళాశాల విద్యా కమిషనర్ జేడీ రాజేంద్రసింగ్ తదితరులు ఉన్నారు. రెండు రోజుల పాటు 2018 నుండి 2023 వరకు జరిగిన అభివృద్ధి, కళాశాలలోని వసతులు, ఫలితాలను పరిశీలిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. మొదటి రోజు విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతోనే కాక కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ శ్రీరామ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌మెన్లకు శిక్షణ పూర్తి

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలోని 589గ్రామపంచాయతీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా, నిరంతరాయంగా అందించేలా వాటర్‌మెన్లకు శిక్షణ ఇచ్చారు. గురువారం నాటికి 20 మండలాల్లో 600 మందికి శిక్షణ పూర్తయిందని మిషన్ భగీరథ ఈఈ పుష్పలత తెలిపారు. మోటార్లు, పైపులైన్ల మరమ్మతు తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో విధినిర్వహణ సులువవుతుందని పేర్కొన్నారు.

భద్రాద్రి జిల్లాకు చేరుకున్న గవర్నర్

- నేడు ఉమ్మడి జిల్లాలో పర్యటన



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న భద్రాద్రి కలెక్టర్ పాటిల్ తదితరులు

బూర్గంపాడు: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గురువారం సాయంత్రం భద్రాద్రి జిల్లాకు చేరుకున్నారు. ఆయనకు బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్ వద్ద పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అలాగే, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్ స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం భద్రాచలంలో రామయ్యను దర్శించుకోనున్న గవర్నర్.. భద్రాద్రి, ఖమ్మం కలెక్టరేట్లలో అధికారులు, ఎంపిక చేసిన వివిధ రంగాల ప్రముఖులతో భేటీ కానున్నారు.

క్లుప్తంగా

అమ్మపాలెం వాసికి డాక్టరేట్


గుగులోత్ వెంకన్న

కొణిజర్ల: కొణిజర్ల మండలం అమ్మపాలెంకు చెందిన గుగులోత్ వెంకన్న అనంతపురంలోని జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కే.ఎఫ్.భారతి పర్యవేక్షణలో ఆయన 'టెక్ట్స్ డాక్యుమెంట్ క్లస్టరింగ్ యూసింగ్ సెంట్రాయిడ్ అండ్ నైబర్ హుడ్ అప్రోచెస్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంధానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకన్నను గ్రామస్తులు అభినందించారు.

పంట నమోదును పరిశీలించిన అధికారులు


ఎరువుల దుకాణంలో పరిశీలిస్తున్న అధికారులు

పెనుబల్లి: డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా పంటల నమోదు కార్యక్రమాన్ని పెనుబల్లి మండలంలో జిల్లా వ్యవసాయాధికారి ధనసిరి పుల్లయ్య, సత్తుపల్లి ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. అలాగే, మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి నిల్వలు, అమ్మకాలపై ఆరా తీసి సూచనలు చేశారు. ఏఓ ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ ఆస్పత్రిలో వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మెదడు, వెన్నుముక, నరాల చికిత్సకు సంబంధించి శిబిరంలో 87 మంది పరీక్షలు చేయించుకున్నారని ఆస్పత్రి బాధ్యులు భీమిరెడ్డి, బాబురెడ్డి తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల ప్రజలు శుక్రవారం కూడా కొనసాగే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26, 27వ తేదీల్లో 'ఐలు' మహిళా సదస్సు

ఖమ్మం లీగల్: అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు ఖమ్మంలో ఈనెల 26, 27వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు బాధ్యులు నల్లమల నవీన్ చైతన్య, మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో జరిగే సదస్సులో తొలిరోజు హైకోర్టు న్యాయమూర్తి పి.సుధ, ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, ఐలు గౌరవ అధ్యక్షుడు జి.విద్యాసాగర్, బాధ్యులు కొల్లి సత్యనారాయణ, శైలజ తదితరులు పాల్గొంటారని, రెండో రోజు ప్రతినిధుల సభ ఉంటుందని వెల్లడించారు.

విధుల్లో చేరిన 99 మంది ఏఈఓలు

ఖమ్మంవ్యవసాయం: సమస్యలు పరిష్కరిస్తామని ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు సామూహిక సెలవులో ఉన్న వ్యవసాయ విస్తర్ణాధికారు(ఏఈఓ)లు గురువారం విధుల్లో చేరారు. పనిభారం తగ్గించాలనే డిమాండ్‌తో కొద్ది రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న ఏఈఓలు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం సామూహిక సెలవు పెట్టారు. ఈ మేరకు హైదరాబాద్‌లో టీఎన్జీవోస్, ఏఈఓల జేఏసీ ప్రతినిధులు గురువారం వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, ఉన్నతాధికారులను కలిసి 60 మంది ఏఈఓల సస్పెన్షన్ ఎత్తివేయాలని, డిజిటల్ క్రాప్ సర్వేను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని కోరారు. దీంతో ఉన్నతాధికారులు హామీ ఇవ్వగా జిల్లాలో 99 మంది ఏఈఓలు విధుల్లో చేరారు. అనంతరం వారితో సమావేశమైన జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల్ మీరా మాట్లాడుతూ గత ఏడేళ్లలో లేని విధంగా వేతన బిల్లులను ప్రత్యేకంగా చేయించడం ఏమిటని ప్రశ్నించారు. అయితే, ఉన్నతాధికారుల హామీతో శనివారం వరకు విధులు నిర్వర్తిస్తామని, అయినా సమస్యలు పరిష్కారం కాకపోతే సోమవారం నుంచి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

బంగారు ఆభరణాలు చోరీ

కారేపల్లి: ఇంటి తాళం పగలగొట్టిన దుండగులు బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని చింతలతండా గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన భూక్యా బుజ్జి కుటుంబీకులు ఉదయం కూలి పనులకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళం పగలకొట్టి బీరువాలో దాచిన రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికొచ్చాక గమనించిన బుజ్జి ఫిర్యాదుతో కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

పత్తికి ప్రతికూలమే..

- వరుస వర్షాలతో రంగు మారుతున్న పత్తి
- మరోవక్క దిగుబడి సైతం తగ్గిన వైనం
- ఫలితంగా నష్టపోతున్న రైతులు



అధిక వర్షాలతో ఎర్రబారిన పత్తి చేను, (ఇన్‌సెట్) మొక్కలపైనే దెబ్బతింటున్న పత్తి

ఖమ్మం వ్యవసాయం/రఘునాథపాలెం/తిరుమలాయపాలెం: జిల్లాలో పత్తితీత పనులు సాగుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో 1,91,234 ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. ఆది నుంచి ప్రతికూల పరిస్థితులే ఎదురవుతున్నాయి. విత్తే సమయాన వాతావరణం అనుకూలించినా ఆతర్వాత పూత, కాత దశలో సాధారణానికి మించి వర్షాలు కురవడంతో పైర్లు దెబ్బతిన్నాయి. ఇక ఇప్పుడు చేతికొచ్చే సమయాన దాదాపు ప్రతిరోజు వర్షం కురుస్తుండడంతో పత్తి రంగు మారి నాణ్యత కోల్పోతోంది. అయితే, ఎకరాకు 5నుంచి 8క్వింటాళ్లు.. కొన్నిప్రాంతాల్లో అంత కంటే తక్కువ దిగుబడే వస్తోందని చెబుతున్నారు.

వరుస వర్షాలతో..

పత్తి సాగు ఆరంభంలో పరిస్థితులు బాగుండడంతో పైర్లు ఏపుగా పెరిగాయి. ఇక కాపు దశలో అకాల వర్షాలు నిలువునా ముంచాయి. సుమారు నెల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో పత్తి గిడస బారి, ఆకు ఎర్రబారడంతో దిగుబడి ప్రభావం చూపుతోంది. ఎకరానికి కనీసం 10నుండి 15 క్వింటాళ్లు దిగుబడి వస్తేనే రైతులకు పెట్టుబడులు పోను ఎంతోకొంత లాభం చేకూరుతుంది.అధిక వర్షాలతో పత్తి ఎదుగుదల నిలిచి పెరిగిన చెట్లు సైతం ఎర్ర బారి ఎండు తెగులు సోకిన పైరుగా మారి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది.

వారం రోజులుగా వీడని వాన

దాదాపు జిల్లా అంతటా వారం రోజుల నుంచి వర్షం కురుస్తోంది. ప్రస్తుతం పత్తి తీసే దశ కావడంతో వర్షం కారణంగా రంగు మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతనెలలో కురిసిన అతి భారీ వర్షాలతో పూత కాత దశలో ఉన్న పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక మిగిలిన తోటల్లో ప్రస్తుతం అరకొరగా ఉన్న పత్తి పంటను తీసేందుకు సిద్ధమవుతున్న తరుణాన మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ కూడా పూర్తిస్థాయిలో పత్తి కొనుగోళ్లు మొదలుపెట్టకపోవడంతో తేమ, నాణ్యత పేరిట ప్రైవేట్ వ్యాపారస్తులు క్వింటాకు రూ.6వేలకు మించి చెల్లించడం లేదు. పలితంగా పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారు.

దిగుబడి తగ్గుతోంది...



వరి తర్వాత అత్యధికంగా పత్తి సాగవుతోంది. రఘునాథపాలెం మండలంలో 15 వేల ఎకరాల పైగా సాగు చేశారు. పంట ఆరంభంలో ఆశాజనకంగానే ఉంది. ఆ తర్వాత భారీ వర్షాలతో పత్తి పైర్లు ఎర్రబారడమే కాక ఆకు రాలింది. దిగుబడి కూడా ఎకరాకు ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్లే వస్తోందని రైతులు చెబుతున్నారు. అధిక వర్షాలే దిగుబడిపై ప్రభావం చూపాయి. అయితే, సస్యరక్షణ చర్యలు పాటించిన రైతుల చేన్లలో మాత్రం దిగుబడి కాస్త ఆశాజనకంగానే ఉంది.

– కె.ఉమామహేశ్వరరెడ్డి, ఏఓ, రఘునాథపాలెం

చింతకాని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అరెస్ట్

- మధిర, వైరా మీదుగా ఖమ్మం తరలింపు, రిమాండ్
- ఘటనతో పుల్లయ్య సతీమణికి గుండెపోటు
- వివరాలు ఆరా తీసిన మాజీ మంత్రి కేటీఆర్


ప్రొద్దుటూరులో పుల్లయ్యను తీసుకెళ్తున్న వాహనాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

చింతకాని/మధిర,/వైరా: బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను మండలంలోని ప్రొద్దుటూరులోని నివాసంలో పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వైరా సీఐ సాగర్‌తో పాటు వైరా, కొణిజర్ల, చింతకాని, తల్లాడ, బోనకల్ ఎస్సైలు గ్రామానికి చేరుకుని అయ్యప్ప దీక్షలో ఉన్న ఆయనను అదుపులోకి తీసుకుని తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని తొలగించి మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షల అనంతరం పుల్లయ్యను వైరాకు, అక్కడి నుంచి ఖమ్మం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఇదీ కారణం

మండలంలోని లచ్చగూడెంలో ఈనెల 5న విద్యుదాఘాతానికి గురై రైతు గూని ప్రసాద్ మృతి చెందాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని మృతదేహంతో కొదుమూరు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఆతర్వాత మృతదేహంతో కలెక్టరేట్ వద్దకు వెళ్లాలని మృతుడి కుటుంబీకులు సిద్ధం కాగా పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు కొందరు పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారని, దీని వెనుక బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలం ఉందని పుల్లయ్య తదితరులపై కేసు నమోదు చేశారు. ఇక ప్రొద్దుటూరులో జూలై 1వ తేదీన రైతు బోజెడ్ల ప్రభాకర్ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటనలోనూ పుల్లయ్య నిందితుడిగా ఉండడంతో ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు. కాగా, కొదుమూరు ఘటనలో పోలీసుల విధుల ఆటంకం కలిగించిన పది మందిపై కేసు నమోదు చేయగా నరేష్(ఏ–1), పెంట్యాల పుల్లయ్య(ఏ–10)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నారని వైరా సీఐ సాగర్ ప్రకటించారు.

పుల్లయ్య భార్యకు గుండెపోటు

పోలీసులు ఆకస్మాత్తుగా వచ్చి ఇంట్లో ఉన్న పుల్లయ్యను అరెస్ట్ చేసి తీసుకెళ్తుండడంతో ఆయన భార్య భారతమ్మకు ఆందోళనకు గురయ్యారు. ఈనేపథ్యాన ఆమెకు గుండెపోటు రావడంతో కుటుంబీకులు అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

రాజకీయ ప్రేరేపిత చర్య

బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను అరెస్ట్ చేయటం రాజకీయ ప్రేరేపిత చర్యగా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఆరోపించారు. అయ్యప్ప దీక్షలో ఉన్న పుల్లయ్యను టెర్రరిస్టు మాదిరిగా అరెస్ట్ చేశారని, ఈక్రమంలో మహిళలతో అనుచితంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, మధిర బీఆర్ఎస్ కార్యాలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ పుల్లయ్యపై అక్రమ కేసులు బనాయించడమే కాక బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పడం గర్హనీయమని పేర్కొన్నారు. అనంతరం మధిర రూరల్ స్టేషన్‌కు పుల్లయ్యను తీసుకొచ్చారనే సమాచారంతో అక్కడకు వెళ్లి నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చావా వేణు, బొగ్గుల వీరారెడ్డి, సురేష్, నాగబాబు, అబ్బూరి రామన్, శీలం కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఇక మాజీ మంత్రి కేటీఆర్ కమల్‌రాజ్‌కు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. అనుచితంగా వ్యవహరించిన పోలీసుల పేర్లు రాసి పెడితే.. అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కాగా, వైరా పోలీసుస్టేషన్ వద్ద కూడా కమల్‌రాజ్, నాయకులు నిరసన తెలిపారు.

విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు?

- అభివృద్ధి పనుల్లో డొల్లతనంపై కదలిక
- కేఎంసీ అధికారులకు నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: గత ప్రభుత్వ హయాంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో 'సుడా' నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఐదు నెలల క్రితం విజిలెన్స్ కమిటీ విచారణ చేపట్టింది. ఈక్రమంలో ఎన్నికలకు ముందు జరిగిన పనుల్లో నాణ్యత లోపించిందని గుర్తించగా నివేదికను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్‌హెల్త్ అధికారులకు అందించినట్లు సమాచారం. ఈ నివేదికల ఆధారంగా పలువురిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిసింది. అంతేకాక కాంట్రాక్టర్ల నుంచి రూ.21,42,385 రికవరీ చేయాలని పేర్కొన్నట్లు సమాచారం. ఇక పబ్లిక్ హెల్త్ నుంచి కేఎంసీలో నాడు విధుల్లో ఉన్న ఏడుగురు అధికారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిసింది.

కార్మికుల మార్పు, జీతాల పెంపుపై విచారణ?

గత ప్రభుత్వ హయాంలో కేఎంసీ పరిధిలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం కార్మికుల మార్పు, జీతాల పెంపులో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులతో విచారణకు ఆదేశించినట్లు సమాచారం. పలువురికి అర్హత లేకున్నా పైరవీతో విధులు మార్చుకొని వేతనం పెంచుకున్నారని, తద్వారా కేఎంసీపై భారం పడిందని గుర్తించినట్లు తెలిసింది. ఇప్పటికే నివేదికలు పరిశీలించిన అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపి, అప్పటి ఉద్యోగులపై అభియోగాల నమోదు కోసం ఓ అధికారిని నియమించినట్లు తెలిసింది. రెండు, మూడు రోజుల్లో విచారణ అధికారి కేఎంసీకి రానున్నట్లు తెలిసింది.

విస్తృతంగా వాహన తనిఖీలు

ఖమ్మం క్రైం: నార్కోటిక్ డ్రగ్స్ విభాగానికి చెందిన పోలీసులు ఖమ్మంలో గురువారం రాత్రి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఇల్లెందు రోడ్డులో వాహనాలను ఆపి వివరాలు ఆరాతీశారు.అయితే, ఇవి సాధారణ తనిఖీలేనని, ఎలాంటి మత్తు పదార్థాలు పట్టుబడలేదని టుటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు..

ఖమ్మంక్రైం: బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఖమ్మంలో పదో తరగతి చదువుతున్న బాలికను ఆమె బంధువైన యువకుడు పాఠశాల వద్ద దిగబెడుతానని చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు ఖమ్మం టుటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

చిరుతపులి పిల్ల సంచారం


చిరుతపులి పిల్ల పాదముద్రలను సేకరిస్తున్న అధికారులు

ఏన్కూరు: మండలంలోని రేపల్లెవాడ సమీపాన ఓ మిర్చితోటలో బుధవారం సాయంత్రం చిరుతపులి పిల్ల సంచరించింది. తోటకు కాపలా ఉన్న వ్యక్తి ఈ విషయాన్ని గమనించి రైతు శ్రీహరికి తెలిపాడు. దీంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా డీఆర్ఓ శ్రీనివాస్, ఎఫ్‌బీఓలు దుగ్గిరాల శ్రీను, చందానాయక్, నర్సింహారావు గురువారం పరిశీలించి పాదముద్రలు సేకరించారు. అయితే, ఈ పాదముద్రలను చిరుతపులి పిల్లవిగా అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల ఏన్కూరు మండలానికి సరిహద్దుగా ఉన్న జూలూరుపాడు మండలంలో చిరుతపులి తిరిగినట్లు నిర్ధారించగా అది పిల్లలు పెట్టి ఉంటుందని, అవే తిరుగుతుంటాయనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈనేపథ్యాన రేపల్లెవాడ వాసులు ఆందోళన చెందుతుండగా అంతా అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు.

ప్రేమించిన యువకుడు కాదన్నాడని...

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తిరుమలాయపాలెం: ప్రేమించిన వ్యక్తి కాదన్నాడనే ఆవేదనతో ఇంటర్ విద్యార్థిని గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెంకు చెందిన కొత్తపల్లి రాములు – రమాదేవి చిన్న కుమార్తె స్పందన(17) పిండిప్రోలు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్లకు చెందిన మాతంగి విష్ణును ఆమె ప్రేమించగా, ఈనెల 17న చిల్లంచర్లలో తన స్నేహితురాలి వివాహానికి వెళ్లిన సందర్భంలో విష్ణు గొడవ పడడమే కాక స్పందనను వివాహం చేసుకోనని చెప్పినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో గడ్డి మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


నేతల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని

నేలకొండపల్లి: హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. నేలకొండపల్లి మండలం మోటాపురంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య ఉద్రేకాలు సృష్టిస్తూ మతోన్మాద విధానాలను అవలంభిస్తోందని ఆరోపించారు. హిందూ రాజ్యమంటూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని తెలిపారు. ఇక రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు అసంతృప్తి పెరుగుతోందన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లకు టీసులు ఇవ్వకుండా బలవంతంగా తొలగించడం సరికాదని చె ప్పారు. కేసీఆర్‌పై కోపంతోనే కాంగ్రెస్‌ను గెలిపించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. మరోపక్క రైతు రుణమాఫీ చేయడంలో విఫలం కాగా, రైతు భరోసా ఊసేలేదన్నారు. కాగా, జనవరి 28, 29వ తేదీల్లో సీపీఎం రాష్ట్ర మహాసభలను సంగారెడ్డిలో నిర్వహించనున్నట్లు వీరభద్రం తెలిపారు. కమ్యూనిస్టుల సిద్ధాంతం ఒకటేనని, ధనికులు పేదలను దోచుకున్నంత కాలం కమ్యూనిస్టుల సిద్ధాంతం సజీవంగా ఉంటుందని తెలిపారు. నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, కే.వీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.39.34లక్షలు


దాతలు మధు, యామినిని సన్మానిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం నడుమ కొలువైన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారి పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారి పర్యవేక్షణలో లెక్కించగా 132 రోజులకు గాను రూ.39,34,78 ఆదాయం నమోదైంది. అలాగే, వివిధ దేశాల కూడా కరెన్సీ కూడా లభ్యమైంది. ఇక మిశ్రమ వెండి, బంగారాన్ని తిరిగి హుండీలో వేసినట్లు ఈఓ తెలిపారు. కరూర్‌వైశ్య బ్యాంక్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదానానికి విరాళం

శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో శాశ్వత అన్నదానానికి ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన ఎస్.మధు – యామిని రూ.1,11,116 విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఈఓ రజనీకుమారి అమ్మవారి శేష వస్త్రాలతో సన్మానించారు.

నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి


మాట్లాడుతున్న ఎస్సీ డీడీ సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం సమకూర్చాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి గుడికందుల జ్యోతి సూచించారు. వసతిగృహాల్లో వంట తయారుచేసే సిబ్బందికి ఖమ్మంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు పాటిస్తూ భోజనం తయారుచేయాని తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విష్ణువందన మాట్లాడగా, నిపుణులతో వంటల తయారీపై అవగాహన కల్పించారు. అధికారులు, వార్డెన్లు ఎం.ఈదయ్య, డి.నర్సయ్య, కె.వెంకటేశ్వరరావు, అబ్దుల్ రవూఫ్, కోటపాటి రుక్మారావు, నెల్లూరి నాగేశ్వరరావు, టి.స్టాలిన్, ఆర్.రాజ్యలక్ష్మి, నూర్జహాన్‌బేగం, అస్త్రపు నిషా బేగం, సైదులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ చేయూతతో దివ్యాంగురాలికి వీల్‌చైర్


శారదకు వీల్‌చైర్ అందజేస్తున్న రఘు తదితరులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలోని గోల్‌తండాకు చెందిన దివ్యాంగురాలి ఇక్కట్లపై ఇన్‌స్టాగామ్ వీడియోలో చేసే రఘు తన ఫాలోవర్ ద్వారా గురువారం వీల్‌చైర్ అందించారు. గోల్‌తండాకు చెందిన బానోత్ శారద యువతి పుట్టకతోనే కాళ్లు, చేతులు పడిపోయి ఇబ్బంది పడుతుండగా, ఆమె ఇక్కట్లను మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన రఘుకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్టాగామ్‌లో వీడియోలు అప్‌లోడ్ చేసే ఆయన తన ఫాలోవర్, అమెరికాలో ఉంటున్న ప్రశాంతి ద్వారా వీల్‌చైర్ అందించారు. ఈసందర్భంగా దాతకు శారద తల్లిండ్రులు కృతజ్ఞతలు తెలపగా యాకన్న, సురేష్, అనిల్, సంతోష్, బండారి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల తర్వాత ఆత్మీయ కలయిక


సమ్మేళనంలో పాల్గొన్న 1984 బ్యాచ్ కానిస్టేబుళ్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 1984లో ఎంపికైన కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం ఖమ్మంలో నిర్వహించారు. కానిస్టేబుళ్లుగా ఉద్యోగం ప్రారంభించి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్ఐ హోదాల్లో ఈ బ్యాచ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వీరంతా నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకోవాలని నిర్ణయించి భేటీ అయ్యారు. 105 మందితో సివిల్ కానిస్టేబుళ్ల బ్యాచ్‌లో ప్రస్తుతం 41 మంది సర్వీస్‌లో ఉండగా, 39 మంది రిటైర్డ్ అయ్యారు. మరో 25 మంది కన్నుమూయగా వారి కుటుంబీకులను ఆహ్వానించి రోజంతా ఆత్మీయతంగా గడిపారు. ఈ సమావేశంలో మోహన్‌రావు, రామచంద్రరావు, రాయప్ప, శ్రీశైలం, రహీం, శ్రీనివాసులు, మాదల శ్రీనివాసరావు, పూనాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మంక్రైం

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బాణాపురం వద్ద గురువారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో ట్రాక్టర్లను సీజ్ చేయడమే కాక యాజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఓ.మురళి తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువకుడు మృతి


అనిల్ (ఫైల్)

కూసుమంచి: మండలంలోని మల్లేపల్లిలో గురువారం బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని జుజుల్‌రావుపేటకు చెందిన సుతారీ కూలీ ఐతం అనిల్(31) ముదిగొండ మండలం మాధాపురంలో రావాల్సిన డబ్బు తీసుకుని ఇంటికి బయలుదేరాడు. మల్లేపల్లి వద్ద ఆయన వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో అనిల్ తలకు తీవ్ర గాయం కాగా నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టిప్పర్‌ను అజాగ్రత్తగా, వేగంగా నడిపిన డ్రైవర్ నామవరపు వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని అనిల్ మేనమామ మైసయ్య చేసిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి..


దుర్గారావు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలులో పెట్రోల్ బంక్ వద్ద బైక్ అదుపు తప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ పి.వెంకటేష్ తెలిపిన వివరాలు... కంచికచర్లకు చెందిన వేముల దుర్గారావు(40) తన మోటారు సైకిల్‌పై మధిర నుండి వెళ్తుండగా మీనవోలు వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. ఈక్రమంలో గాయపడిన ఆయనను 108 ఈఎంటీ కృష్ణారెడ్డి, పైలట్ మణికంఠ ప్రాథమిక చికిత్స చేసి మధిర ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయన జేబులో ఉన్న రూ.56,400 నగదును 108 సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రిలో అప్పగించగా, దుర్గారావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
ఖమ్మం
శుక్రవారం ॥ 25-10-2024



● పుప్పొడి నేత

పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే! వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే! అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి. అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది. 'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్కజొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటిన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్



శివాని నేత

ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్లభామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ



మన్నిదా బాను



రీనా వర్గీస్

స్త్రీ శక్తి

ప్రాణం నిలిపి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు ఢీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సైన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్ళగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై–రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్టులకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్టుల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో–పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ



బాల త్రిపుర సుందరి





అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికెట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.

పనిలోనే ఆనందం

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.

– వీఎమ్ఆర్
ఫోటోలు: ఎస్ఎస్ ఠాకూర్





సూజీ బ్రెడ్

హెల్దీ డైట్



కావలసినవి: బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; ఇన్‌స్టంట్ ఈస్ట్ – టీ స్పూన్; చక్కెర పొడి– టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; పాలు – 3 టేబుల్ స్పూన్‌లు; నీరు – అర కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; వెన్న – టీ స్పూన్; సీడ్స్ – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో
ఆటోనో స్కూటరో కారో
బుక్ చేయొచ్చు. వస్తుంది.
కాని ఒంటెను బుక్ చేయొచ్చా?
దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు
ఎడారిలో తప్పిపోయారు.
ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు.
ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు.
ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న
ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైక్‌లు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుండనిపించింది.

బ్యూటిప్స్

మెరిసే మేని ఛాయను కాపాడుకోవాలంటే..



- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.
- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.